# మరో అనసూయ

ఏదో గుర్తొచ్చినట్లు ముంజేతిని ఎదరికి తిప్పుకుని ఉలిక్కిపడి గడియారం వైపుకి చూశాడు చంద్ర.

అలా గడియారం కేసి చూసింది అర్జంటు పనేంలేదు. రోజూ ఈ సమయమప్పుడు అనుకోకుండానే అతని కళ్ళు గడియారం వైపుకి తిరిగిపోతాయి.

ఇది నిన్న ఇవాళ్టి నుంచి జరుగుతున్న పని కాదు. ఉదయం తొమ్మిదిన్నరకీ, సాయంకాలం ఆరుగంటల ప్రాంతంలోనూ అతని కళ్ళు గడియారం కేసి చూడటం, కాళ్ళు అతని యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా కిటికీ వైపుకి నడిపించుకుపోవడం- అతని దినచర్యలో ఓ ముఖ్యమైన భాగమై కూర్చుంది. ఆటైముల్లో ఎదురింటి గేటు శబ్దం అయ్యే సరికి ఏదో చెప్పలేని ఆనందానుభూతి కలిగి ఆమె వెళ్తుంటే, వస్తుంటే ఆమెనే చూస్తూ ఏలోకాల్లో విహరిస్తాడో చెప్పడం అతనికే కష్టం.

ఎన్నోసార్లు అనుకున్నాడు చంద్ర "ఇలా రోజూ ఆమె సౌందర్యాన్ని కన్నుల విందు చేసుకుంటూ, గుండెల నిండా ఆనందాన్ని పీల్చుకునే బదులు ఒక్కసారి ఎక్కడైనా ఆమెని కలిసి తన మనసులోని కోరికని వెల్లడించాలని. కానీ ధైర్యం చాలటం లేదు.

వీళ్ళ ద్వారా, వాళ్ళ ద్వారా సేకరించిన వివరాలని బట్టి ఆమె పేరు శిల్ప అని, వివాహిత అనీ, వివాహమయిన ఏడాదికే భర్తకి ఏదో జబ్బు చేసి మంచం పట్టేడని, అతని ఆఫీసులోనే ఆమెకో చిన్న ఉద్యోగం యిచ్చారని, తరవాతే ఆమె తన ఎదురింట్లో ఓ గది అద్దెకి తీసుకుని భర్తతో వుంటోందని -

ఆమె వయసు ఇరవై, ఇరవైరెండుకి మించి వుండవు. ఆమె అందం ఎంతటి వారినైనా రెప్పవాల్చకుండా చూసేలా చేస్తుంది. కొందరిలో శరీర ఛాయ మాత్రం అందాన్ని తెస్తుంది. రంగు తక్కువయినా కొందరికి కనుముక్కు తీరు, అవయవ సౌష్ఠవం చక్కదనాన్నిస్తుంది. కానీ ఈమె సౌందర్యాన్ని వర్ణించడానికి మాటలు కూడా దొరకవేమో! పాలరాతిని అరగదీసి గంధంగా

పూయడంతో ఆమె రంగు కూడా పాలరాతితో పోటీ పడేది. నిజానికి ఒక్క మగవాళ్ళే కాదు. రోడ్డున పోయే స్త్రీలు సహితం ఆమె అందాన్ని చూసి రెప్పవాల్చడం, ఊపిరి తీసుకోవడం మరిచిపోయే వారంటే అతిశయోక్తి కాదు. అలాంటి సౌందర్యవతి గాథ విన్నప్పుడు చంద్ర హృదయం బాధతో గిలగిల్లాడి పోయింది. పాతిక వసంతాలన్నా చూడని ఆ పరువం అడవి కాచిన వెన్నెలయి పోతోందని ఎన్నోసార్లు అనుకుని బాధపడేవాడు. ఇలా వచ్చే ఆలోచనలతో పాటు తన మనసులో వున్న కోరికని ఆమెకి ఎలా వ్యక్తం చేయ్యాలి? ఆమెని ఎలా ఒప్పించాలి? అన్న ఆలోచన కూడా అతని మదిని తొలచసాగింది.

చాలాసార్లు ధైర్యం తెచ్చుకుని ఆమెకి ఎదురెళ్ళి, ఆమె దరికి రాగానే స్తబ్దుగా నిలబడిపోవడమే కాదు, అంతదాకా తెచ్చిపెట్టుకున్న ధైర్యం కాస్తా నీరయిపోయి చెమటల రూపంలో కమ్మి, ముఖం ఒళ్ళు తడిసిపోయి గజగజ వణికిపోయే వాడు. అది ఆమె గమనిస్తే తనకే అవమానం అనుకుని తలదించుకుని వచ్చేసేవాడు.

ఎప్పటిలాగే ఉదయం తొమ్మిదిన్నర అవుతుండగా కిటికీ దగ్గరకి తీసుకెళ్ళింది చంద్రని. గంటనుంచి నిలబడి చూస్తున్నా ఆమె బైటికి రాలేదు. "ఇవాళింక ఆఫీసుకి వెళ్ళదనుకుంటా" అనుకుని లోపలికి వెళ్ళబోతున్న చంద్రకి శిల్ప గబగబా బైటికి రావడం, గేటు ముందుగా పోతున్న ఆటోని ఆపు చెయ్యడం కనబడింది. ఆమె ముఖంలో ఆదుర్దా, ఆందోళన స్పష్టంగా కనబడుతోంది. ఆటో ఆగగానే అతనికి ఏదో చెప్పి లోపలికెళ్ళి భర్తని అతికష్టం మీద బైటికి తీసుకొస్తున్న శిల్పని చూసిన చంద్ర చెప్పులేసుకుని బైటికెళ్ళాడు. అప్పటికే శిల్ప భర్తని ఈడ్చుకొస్తున్నట్లే ఒక్కర్తీ అవస్థపడుతూ ఆటో దగ్గరికి తీసుకొస్తోంది.

పనుండి బైటికెళ్తూ వాళ్ళని చూసినట్లు, ఒక్కర్తీ అవస్థ పడుతుంటే ఆమెకి సహాయపడటానికెళ్ళినట్లూ ఆమె వద్దకెళ్ళి "మే ఐ హెల్ప్‌యూ?" అంటూనే శిల్ప భర్త కాళ్ళని ఎత్తి, ఆమె భుజాలు పట్టుకోగా ఆటో ఎక్కించాడు. ఆటో ఎక్కబోతున్న శిల్పని చూసి "సీరియస్‌గా వుందనుకుంటాను మీకు అభ్యంతరం లేకపోతే ఆసుపత్రికి తోడు వస్తాను. నేను మీ ఎదురింట్లో వుంటాను తెలుసుగా!" అన్నాడు దొరికిన అవకాశాన్ని వదులుకోకుండా. నిజానికి ఈ టైములో ఆమెకి ఒక మగ సహాయం చాలా అవసరం. అందుకు వెంటనే "సరే"

అనాలని ఉన్నా "మీరు ఆఫీసుకి వెళ్ళాలేమో!" అంది డైరెక్టుగా రమ్మనలేక. "పరవాలేదండీ! వస్తా" అంటూనే ఆమె భర్త పక్కన కూర్చున్నాడు.

వారం రోజులు ఆసుపత్రిలో వుంచి కాస్త నయం అయ్యాక ఇంటికి తీసుకొచ్చింది శిల్ప భర్తని. ఈ వారం రోజుల్లో ఆసుపత్రికి వెళ్ళిరావడం, ఆమె భర్తకి కావలసిన మందులు, పళ్ళూ తేవడం లాంటివి చేస్తూ ఆమెకీ, ఆమె భర్తకీ కాస్త దగ్గరయ్యాడనే చెప్పాలి. శిల్ప భర్త ఇంటికొచ్చేసాక కూడా తరచూ వెళ్ళి చూసి వస్తూ కావలసిన సహాయం చేస్తూ వుండేవాడు.

ఓ రోజు మాటల్లో చెప్పిన విషయం: తమది ప్రేమ వివాహమని, అది యిష్టంలేని యిద్దరి తల్లితండ్రులు వీళ్ళని గుమ్మం తొక్కనివ్వలేదని, తమకి 'నా' అన్న వాళ్ళెవ్వరు లేరని చెప్పగానే శిల్ప పట్ల మరీ జాలి పెరిగిపోయిందతనికి.

వారి పరిచయం అలా పెరిగి, శిల్ప తనకే సహాయం కావాలన్నా చంద్ర గదికి వెళ్ళి చెప్పేంత దాకా ఎదిగింది. శిల్ప తనతో చనువుగా మాట్లాడుతూ ఓ ఆత్మీయుడితో మసులుతున్న కొద్దీ చంద్రలోని కోరిక పడగెత్తి బుసకొట్ట సాగింది. ఆ కోరికని బైటపెట్టే అవకాశం కోసం ఎదురు చూడసాగాడు.

ఒకటో తేది సాయంత్రం చంద్ర దగ్గర తీసుకున్న డబ్బు యివ్వడానికి చంద్ర గదికి వచ్చింది శిల్ప. డబ్బు అందుకున్న చంద్ర శిల్పని చూస్తూ 'మీ వారికి ఈ జబ్బు నయం అవదంటారా?' అన్నాడు.

"ఆ విషయమే మీతో మాట్లాడదామని ముఖ్యంగా వచ్చాను. నిన్న మా ఆఫీసులో మా కొలీగ్ నన్ను ఓ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయన మా వారి రిపోర్టులు, ఎక్సరేలు చూసి మా వారికి వైద్యం చేసి మళ్ళీ మామూలు మనిషిని చేసే పూచీ తనదని హామీ యిచ్చారు. కానీ ఆ వైద్యానికి యాభైవేలదాకా ఖర్చు అవుతుందని, డబ్బు తీసుకొస్తే వైద్యం ప్రారంభిస్తాననీ అన్నాడు. చంద్రంగారూ! నాకొచ్చే జీతంతో మా రోజులు గడవడమే దుర్భరంగా వుంటే యాభైవేలు ఎక్కడి నుంచి తేను? యాభై అంటే ఒక్క యాభైవేలే సరిపోవుగా? మరో పదివేలన్నా దగ్గరుంచుకోవాలి కదా! ఎవరు యిస్తారంత డబ్బు?" అంది తలదించుకుని.

వెంటనే నాలో దాగిన కోరిక వెన్ను చరిచి "మంచి అవకాశం వదులుకోకు" అని చెప్పింది. కాస్సేపు మౌనంగా ఆలోచించి "శిల్పగారూ మీకో

విషయం చెప్తాను దానికి మీరంగీకరిస్తే మీకు ఓ లక్షరూపాయలు యిస్తాను అన్నాడు. లక్ష అన్న పదాన్ని వినగానే ఒక్కసారిగా తలెత్తి చూసిన శిల్ప ముఖంలో ఆనందం, ఆశ్చర్యం అలుముకున్నాయి. మళ్ళీ కాస్సేపు గదంతా నిశ్శబ్దం అవరించింది.

ప్రేమ వివాహం వల్ల అనుకుంటాను మంగళసూత్రాలు లేని ఆమె మెడని ఓ పూసలదండ ముద్దాడుతోంది. మాటలు రాని ముగ్ధలా కూర్చున్న ఆమె మౌనాన్ని అంగీకారంగా భావించి నెమ్మదిగా తన కోరికని బైటపెడుతున్నప్పుడు అతని పెదాలు కూడా వణకసాగాయి.

అతని కోరికని విన్న శిల్ప ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికి వచ్చి వెక్కి వెక్కి ఏడవసాగింది.

"భయపడ్డంతా అయింది" అనుకున్న చంద్రకి ఏం చెయ్యాలో తోచక ఆమె చేతులు పట్టుకుని "క్షమించండి శిల్పగారూ! పొరపాటయిపోయింది. మన్నించి నేనడిగిన ఈ విషయాన్ని యిక్కడే మర్చిపోండి. ఈ సంగతి మనిద్దరిలోనే సమాధి కావాలి, తప్పయిపోయింది" అంటూ బ్రతిమాలగానే ఏడుపుని తమాయించుకుని 'సారీ చంద్రగారూ! నేనా పనికి మాత్రం ఒప్పుకోను' అంటూ కళ్ళు తుడుచుకుని లేచి వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న శిల్పనే చూస్తూ కుర్చీలో కూలబడిపోయాడు. "ఎంత తప్పు పని చేసావు చంద్రా!" అంటూ అతని అంతరాత్మ అతన్ని నిందించసాగింది. ఆమె అవసరాన్నిలా ఉపయోగించుకోడం ఎంత తప్పో ఆమె వెళ్ళేకా తెలుసుకున్నాడు. ఆ తప్పెలా దిద్దుకోవాలో తెలీటంలేదతనికిప్పుడు.

ఆ రోజు తరవాత శిల్ప తనింటికి రాలేదు. తనూ వెళ్ళలేదు. ఇంట్లో కూర్చున్నా, బైట తిరుగుతున్నా 'శిల్పని ఎంత అమర్యాదకరమైన కోరిక కోరాను, ఆమె ఎంత బాధపడింది!' అన్న ఆలోచనే అతన్ని తినేస్తోంది. పది రోజులు గడిచి పోయాయి. శిల్పని ఎంత తప్పించుకు తిరుగుతున్నా ఎక్కడో అక్కడ ఎదురు పడుతోంది. దొంగపని చేసిన వాడిలా పక్క సందులోకి తప్పుకోవడమో, తలొంచుకు రావడమో జరుగుతోంది. దాంతో తను ఇల్లు మారిపోవాలని నిశ్చయించుకోడం, మారిపోవడం కూడా చేసాడు. కొత్త యింట్లో కొచ్చాకే కాస్త మనశ్శాంతి లభించినట్లుంది. నెమ్మదిగా పాతగాడిలో పడటానికి

ప్రయత్నించసాగాడు.

సాయంకాలం ఆరుగంటలు దాటి వుంటుంది. తలుపు తట్టిన శబ్దానికి వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా శిల్ప! ఎర్రంచు తెల్ల చీర, ఆమెని చూసి 'కలా... నిజమా' అనుకుంటూ చేష్టలుడిగి నిలబడిపోయాడు చంద్ర. "లోపలికి రావచ్చా?" అన్న పలుకులు అతన్నీ లోకంలోకి రప్పించి, సంస్కారం తట్టిలేపగా "రండి శిల్పగారూ!" అన్నాడు. "మీరానాడు నన్నో కోరిక కోరారు గుర్తుందా?" అంటూ అతని ముఖంలోకి చూసింది.

మానుతున్న పుండుని కెలుకు తున్నట్లనిపించి, మళ్ళీ ఏం గొడవ జరుగుతుందో అనుకుని, దానికేం జవాబివ్వాలో తెలీక తలొంచుకున్నాడు. "నేను మీ కోరిక తీర్చడానికే ఇవాళిలా వచ్చాను." అంది అతని జవాబుకి ఎదురు చూడకుండా శిల్పే మళ్ళీ.

చంద్రకి మతిపోయినట్లనిపించింది. తను వింటున్నది 'నిజమేనా? నిజమేనా?' అనుకున్నాడు తనలో తనే. మైకం వదిలినట్లు కాస్సేపటికి స్పృహలోకొచ్చాడు చంద్ర-శిల్ప అవే మాటలు వల్లించగా, "నిజంగానే అంటున్నారా? నిజంగానా? మీరు ఒప్పుకున్నారా?" అన్నాడు ఆనందం పట్టలేక చంద్ర. "నిజమే చంద్రగారూ నిజమే!" అన్న శిల్పని ఆశ్చర్యంగా చూసాడు. చంద్ర మనసులో పాతుకుపోయిన కోరిక, పైగా ఇక "తీరదు" అనుకుని ఆశ వదిలేసుకున్న కోరిక ఇలా వచ్చి తలుపు తడుతుందనుకోలేదు. అతని ఆనందం వర్ణనాతీతం.

వారం రోజులు గడిచాయి. రేపు ఆఖరి రోజు శిల్ప ఇంక ఎల్లుండి నుంచి రాదు అన్న ఆలోచన అతనికి నిద్ర రానివ్వటంలేదు. మర్నాడు తన కోరిక డబ్బాశ చూపించి తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు. క్షణమొక యుగంలా గడపగా ఎదురు చూసిన సాయంకాలం రానే వచ్చింది. ఆ రోజు ప్రత్యేకంగా తయారైన చంద్ర తలుపు తట్టిన శబ్దానికి మన్మధుడిలా వెళ్ళి తలుపు తెరిచాడు. శిల్ప తన్ని ప్రత్యేకించి చూస్తుందన్న ఆశ నిరాశే అయిందతనికి. శిల్ప వెళ్ళే లోపల మనసులో వున్న కోరిక చెప్పడం ఎలా? అన్నదే అతని ఆలోచన.

పది దాటింది. శిల్ప వచ్చి కూర్చుంటూ "మీ పని పూర్తయింది. నా డబ్బు యిస్తారా?" అంది నిర్మొహమాటంగా.

లోపలికెళ్ళిన చంద్ర డబ్బు తీసుకొచ్చి శిల్పకి ఎదురుగా కూర్చుని యిస్తూ "శిల్పా! ఓ విషయం అడుగుతాను జవాబిస్తారా?" అన్నాడు.

"చెప్పండి" అన్న శిల్పని మోహావేశంతో ముగ్ధుడై చూస్తూ "శిల్పా నేనడిగిన రోజు నా కోరికని తిరస్కరించి, మళ్ళీ నా అడ్రసు కనుక్కుని, మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు. కారణం తెలుసుకోవచ్చా?" అన్నాడు.

"చూడండి చంద్రగారూ! అన్నింటికన్నా ముఖ్యమైనది ప్రాణం. మా ఆయనకి ప్రాణమంటే తీపి. నాకు మా ఆయనంటే ప్రాణం. అంటే నాకూ ఆ ప్రాణం ముఖ్యమైనదే కదా? పెళ్ళయిన ఏడాదిలో ఆయన రోగిష్టిమనిషయి నాకే ఆనందమూ అందించలేక పోయినా, ఆయన నా పట్ల చూపిన ప్రేమానురాగాలు జీవితాంతం ఆయనకి సేవచేస్తూ ఇలా బ్రతికేలా చేశాయి. సరే ఈ ఉపోద్ఘాతం ఎందుకు లెండి. మీరడిగినప్పుడు మీ కోరికని మన్నించకుండా తరవాతెందుకు ఒప్పుకున్నానన్నది కదూ మీ సందేహం? చెప్తా వినండి. మీరడిగినప్పుడు బాధ పడ్డాను. ఇంటికెళ్ళినా బాధ అగక, నా భర్తతో మీరాడిన మాటలు చెప్పి ఆయన గుండెల్లో ముఖం దాచుకుని ఏడ్చాను. అన్నీ విన్న ఆయన 'శిల్పా! నీకు నేనంటే ప్రేమ వుందా?' అన్నారు. 'ఎందుకలా అడుగుతున్నారు? నా మీద అనుమానంగా వుందా' అన్నాను. 'లేదు శిల్పా నాకు మళ్ళీ లేచి తిరగాలని వుంది. నీకు నామీద ఏ మాత్రం ప్రేమ వున్నా అతను చెప్పినట్లు చెయ్యి. అతనిస్తానన్న డబ్బుతో మళ్ళీ నన్ను మామూలు మనిషిని చెయ్యి. మనసు నిర్మలంగా వుంచుకుని మనం ఏ పని చేసినా తప్పులేదు. చంద్రని చూస్తున్నాను దుర్మార్గుడిలా అనిపించలేదు. నేను అనుమతిస్తున్నాను. అతను చెప్పినట్లు విని నా ఆరోగ్యం బాగుపడేలా చూడు" అన్నారు. అయినా నేను ఒప్పుకోలేదు. రాను రాను నా భర్త ఆరోగ్యం క్షీణించసాగింది. ఆలోచించగా నా పరువు మర్యాద కన్నా నా భర్త ఆరోగ్యమే నాకు ముఖ్యమనిపించింది. అందుకే మీ దగ్గరకి వచ్చాను. మా వారి అనుమతి మీద వచ్చాను గనకనే చేసింది నాకు తప్పనిపించటంలేదు. మీరిచ్చిన డబ్బుతో వైద్యం జరిగి నాభర్త మళ్ళీ మామూలు వ్యక్తి అయితే తిరపతి కొండ నడిచి ఎక్కుతామని మొక్కుకున్నాం. చంద్రగారూ! మీ మేలు జన్మ జన్మలకీ మర్చిపోను. నా భర్త మళ్ళీ లేచి తిరిగితే వారికి ప్రాణదానం చేసింది మీరే అనుకుంటాం. మా దంపతులం మీ పటానికే రోజూ పూజ చేసుకుంటాం" అంటు లేచి గది మూలకెళ్ళి తృప్తి తీరా చూసి వచ్చి

'చంద్రగారూ! ఆల్ ది బెస్టు - మీరు ప్రపంచ ప్రఖ్యాతి పొందాలి. మీరు నాకిచ్చిన మొత్తం కంటే ఎన్నో రెట్లు దీంతో సంపాదించుకోవాలి 'అంటూ అతని పాదాలని స్పృశించి కళ్ళకద్దుకుని బైటికొచ్చింది. శిల్ప వెళ్ళిపోయింది. కానీ గది మూలని శిల్ప నిలువెత్తు పాలరాతి విగ్రహం శిల్పని తనింట్లో నగ్నంగా నిలిపి మరీ వెళ్ళింది. అంతర్జాతీయ శిల్పకళా పోటీల్లో పాల్గొనాలన్న కోరిక కలగగానే మోడల్‌గా శిల్పని ఊహించుకున్నాడు. ముందు తిరస్కరించినా భర్త యందు ప్రేమానురాగాలు ఆమె చేత ఆ పని చేయించాయి. కానీ ఆఖరికి ఆమెనలా చూస్తూంటే తనలోని కళాకారుడు మరుగున పడి దానిస్థానంలో ఓ కాముకుడు చోటు చేసుకుని ఎన్ని దుర్మార్గపు ఆలోచనలతో ఆమెని కోరుకున్నాను, తను చెక్కే శిల్పానికి మోడల్‌గా నగ్నంగా నిలబడమంటే నిలబడ్డ వనిత నా కామాన్ని మాత్రం చల్లార్చదా? అన్న నీచపు భావంతో, అహంతో ఆమెకి ఈ రోజు మరింత డబ్బాశ చూపించి లొంగదీసుకోవాలనుకున్నాడు. "థేంక్ గాడ్! తొందరపడి ముందే నా దుర్మార్గపు ఆలోచన వెల్లడించకుండా ముందు అసలు విషయం తెల్సుకోడం ఎంత మంచిదయింది. లేదంటే ఆమెకి, ఆమె భర్తకి తన మీదున్న నమ్మకం, గౌరవం ఏమయివుండేవి?" అనుకుని సిగ్గుతో కుంచించుకు పోయాడు.

లేచి గది మూలకి వెళ్ళాడు శిల్ప-శిల్పం.

చంద్ర చెక్కిన పాలరాతి సజీవ శిల్పం-శిల్ప యింకా అక్కడే నిలబడినట్లు వుంది.

ఇప్పుడు చంద్రకి ఆ శిల్పంలో ఆమె నగ్నత్వం కనపడటంలేదు. ఓ మహాపతివ్రత ఆ శిల్పం జాగాలో నిలబడి పతిభిక్ష పెట్టమని అడుగుతున్నట్లుంది.

"ఛీ- ఇలాంటి మహా పతివ్రత శిల్పాన్నా విదేశాల్లో అంతర్జాతీయ ప్రదర్శనల్లో పెట్టి డబ్బు చేసుకుని బహుమతి పొందాలనుకున్నాను?! ఓ మహా యిల్లాలిని నగ్నంగా నలుగురికి చూపాలనుకున్నానా? ఛీ... ఇది మరీ చండాలపు ఆలోచన. అనాలోచితంగా ఎంత నీచపు పని చెయ్యబోయాను!" అంటూ సుత్తి తీసుకుని వారం రోజుల పాటు ఎంతో కష్టపడి చెక్కిన శిల్పాన్ని ముక్కలుముక్కలు చేశాడు చంద్ర. ✳

**(ఫిబ్రవరి - మార్చి 1997 అంజలి)**